క్లుప్తంగా

వీర్ల అంకాలమ్మ దేవస్థాన పునఃప్రతిష్ఠా మహోత్సవం



ఈపూరు : మండలంలోని చిన్నకొండాయ పాలెం గ్రామంలో వీర్ల అంకాలమ్మ దేవస్థానం పునఃప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం జరిగింది. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామపెద్దలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ఘనస్వాగతం పలికి దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఆయనతోపాటు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



యడ్లపాడు: పేదల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్సైదా చెప్పారు. బోయపాలెం గ్రామంలో జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక రైస్‌మిల్లు ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో 15వ వార్డు జాలాది సుబ్బారావు, కొక్కిరి చిట్టిబాబు, ఎ.శ్యామ్, నలమాల సుబ్బారావు, బోయపాలెం వైస్సార్ సీపీ నాయకులు షేక్ రసూల్, సయ్యద్ అమీర్ జానీ, సయ్యద్ ముగ్దుం, వై.ఎస్.కరిముల్లా, వంకాయలపాడు మస్తాన్‌వలి, మానుకొండ శేషిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిలకలూరిపేట: పట్టణంలోని పురుషోత్తమపట్నంలో ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు బ్యాక్‌లాగ్ ఖాళీలలో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఎంపీ మురళీధర్ తెలిపారు. ఎస్టీ 30, ఎస్సీ ఐదు, బీసీ రెండు, ఓసీ ఒకటి, ఏజెన్సీ ప్రాంత ఉద్యోగుల పిల్లలకు ఒకటి, పీహెచ్‌సీ ఒకటి సీట్లు కలవని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంత, పీహెచ్‌సీ అభ్యర్థులు లేనిచో ఆ సీట్లు కూడా ఎస్టీలకు కేటాయించనున్నట్టు వివరించారు. ఎస్టీలకు మాత్రమే ఏడో తరగతి 17, ఎనిమిదో తరగతి 24, తొమ్మిదో తరగతి 15, పదో తరగతి 15 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పురుషోత్తమపట్నంలోని పాఠశాలలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, పూర్తి చేసిన దరఖాస్తులు ఈ నెల 30 లోపు పాఠశాలలో అందజేయాలని వివరించారు.

రక్షిత మంచినీటి చెరువు పరిశీలన

రొంపిచర్ల: నల్లగార్లపాడులోని రక్షిత మంచినీటి చెరువులో చేపలు పట్టుకునేందుకు నీటిని బయటకు పంపుతున్నారని రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు కామినేని రామారావు చెప్పారు. ఈ మేరకు ఆదివారం రైతు సంఘం నాయకులు చెరువును పరిశీలించారు. ఇప్పటికే నాలుగు అడుగుల మేర మంచినీరు బయటకు పంపారని, మరో 24 గంటల పాటు నీరు బయటకు వెళ్తే నీరు అడుగంటుతోందని వివరించారు. దీని గురించి గ్రామస్తులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. చెరువులో నీరు పోతే నల్లగార్లపాడు, పరగటిచర్ల, మాచవరం గ్రామాల ప్రజలు వేసవిలో మంచినీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. తక్షణమే అధికారులు కలుగజేసుకొని పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పోట్లూరి అంజిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి




ఈపూరు : ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన ఈపూరులో ఆదివారం జరిగింది. ఈపూరు గ్రామానికి చెందిన బందెల నాగేశ్వరరావు (55) గేదె, దూడ కనపించడం లేదని వెతకడానికి వెళ్లగా కాలు జారి బావిలో పడి మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోపెల దేవరాజ్, సర్పంచ్ పల్లమీసాల చెంచయ్య పలువురు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

జై భజరంగ భళీ



సొలస రంగనాయకస్వామి గుడిలోని సిద్ధాంజనేయస్వామి



చందనాలంకరణలో బోయపాలెం ప్రసన్నాంజనేయుడు



గణపవరంలో ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి

- వైభవంగా హనుమజ్జయంత్యుత్సవాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- అంజనీపుత్రునికి అభిషేకాలు

యడ్లపాడు/వినుకొండ(నూజెండ్ల)/బొల్లాపల్లి/నరసరావుపేట/చిలకలూరిపేట/నరసరావుపేట ఈస్ట్/నాదెండ్ల /శావల్యాపురం: హనుమజ్జయంత్యుత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. వేకువజాము నుంచే రామాలయాలు, ఆంజనేయస్వామి దేవస్థానాలు భక్తులతో కిటకిటలాడాయి. అంజనీపుత్రునికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. యడ్లపాడులోని రణవీరాంజనేయస్వామి ఆలయం, ప్రపత్తి ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, సొలస రంగనాయకస్వామి దేవస్థానంలోని సిద్ధాంజనేయస్వామి ఉపాలయం, సంగంగోపాలపురంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, బోయపాలెం శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం, హరిహరక్షేత్ర ప్రాంగణంలోని భారీ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తిమ్మాపురం ప్రసన్నాంజనేయస్వామి, జాలాది హరిహరదత్త క్షేత్ర ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంతోపాటు అన్ని రామాలయాల్లోనూ ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు వివిధ రకాల ప్రసాదాలు, మామిడి పండ్లు, విసనకర్రల వితరణ జరిగింది.

- వినుకొండలోని గుంటి ఆంజనేయస్వామి, గమిడి ఆంజనేయస్వామి, పుట్టాబత్తుని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ దీక్షాపరులు, భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గుంటి ఆంజనేయస్వామిని దాదాపు 25 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు దేవదాయ శాఖ ఈవో హనుమంతరావు తెలిపారు. పలుచోట్ల అన్నసంతర్పణలు జరిగాయి.
- బొల్లాపల్లి మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. వెల్లటూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులు పొంగళ్లు పొంగించారు.
- నరసరావుపేట పట్టణంలోని పట్టాభిరామస్వామి దేవస్థానంలో ఆదివారం హనుమజ్జయంత్యుత్సవాలు జరిగాయి. ఆలయంలో కొలువై ఉన్న ఆంజనేయస్వామికి వంశపారంపర్య ధర్మకర్త నాగసరపు సుబ్బరాయగుప్తా, అనురాధ దంపతులు, రూపేష్ గుప్తా, లిఖిత, రాందేవ్‌గుప్తా, తేజస్వీ దంపతులతో వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 200 మంది మహిళా భక్తులు 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.
- చిలకలూరిపేట పట్టణంలోని వివిధ ఆలయాల్లో హనుమజ్జయంత్యుత్సవాలు జరిగాయి. పోలిరెడ్డిపాలెంలోని ఆంజేయస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు విడదల గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు ప్రత్యేక పూజలు చేశారు. ఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మల్లెల రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం జరిగింది.
- నరసరావుపేట అయ్యప్పస్వామి ఆలయంలోని పంచముఖ ఆంజనేయస్వామికి పంచ పండ్ల రసములతో విశేష అభిషేకాలు, రజితాభరణ తోమాలసేవ, 1008 మామిడి పండ్లు, అరటిపండ్లు, తమలపాకులతో విశేష సహస్రనామార్చన నిర్వహించి భక్తులకు మామిడిపండ్లు, విసనకర్రలు ప్రసాదంగా పంపిణీ చేశారు.
- నాదెండ్ల మండలం గణపవరం–కావూరు డొంక రోడ్డులోని వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమజ్జయంత్యుత్సవాలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు నిర్వహించారు. నాగవల్లి దళార్చన నిర్వహించారు. సువర్చలా సమేత వీరాంజనేయస్వామికి గోత్రనామ పూజలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. గణపవరం గ్రామానికి చెందిన ఆలోకం ఆంజనేయులు, రాజ్యలక్ష్మి దంపతులు అందించిన ఆర్థిక సాయంతో 2 వేల మంది భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అద్దంకి మున్సిపల్ మేనేజర్ కాట్రు శ్రీదేవి, శ్రీనివాసరావు దంపతులు ఆలయానికి వెండి శఠగోపురాన్ని అందించారు. గ్రామానికి చెందిన మహిళలు లలితా పారాయణం నిర్వహించారు.
- రొంపిచర్ల మండలంలోని పలు ఆలయాల్లో హనుమజ్జయంత్యుత్సవాలు జరిగాయి. భక్తులకు పండ్లు విసనకర్రలు ప్రసాదాలుగా పంపిణీ చేశారు. పలుచోట్ల అన్నదానాలు జరిగాయి.
- శావల్యాపురం మండలంలోని పలు ఆలయాల్లో హనుమజ్జయంత్యుత్సవాలు నిర్వహించారు.



భజే ఆంజనేయ : రొంపిచర్ల చెరువు గట్టు సెంటర్‌లో ఆంజనేయస్వామి



యడ్లపాడులోని రణవీరాంజనేయస్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు



నరసరావుపేటలో స్వామికి పూజలు చేస్తున్న నాగసరపు సుబ్బరాయగుప్తా దంపతులు



వెల్లటూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద పొంగళ్లు చేస్తున్న భక్తులు

స్వామిని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు రెండు విద్యుత్ ప్రభలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తన్నీరు భారతి, ఎంపీపీ సుహాసిని అనిల్ కుమార్, వైఎస్సార్ సీపీ మండలకన్వీనర్ భీమని అంకారావు, మాజీ సర్పంచ్ తన్నీరు అంకారావు, కో–ఆర్డినేటరు బోడెపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రొంపిచర్ల మండలం గోగులపాడులో అభయాంజనేయస్వామి మూలవిరాట్



నరసరావుపేటలో విశేష అలంకరణలో పంచముఖ ఆంజనేయస్వామి



చిలకలూరిపేటలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



వినుకొండలోని గుంటి ఆంజనేయస్వామి

జగనన్న పాలనలో అందరికీ సంక్షేమం



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

- సామాన్యుల జీవితాలు బాగుపడేలా సంస్కరణలు
- రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికీ మేలు జరుగుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 25వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా వార్డు పరిధిలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. నాలుగేళ్లలో ప్రతి గడపా పొందిన మేలును గురించి వెల్లడించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ప్రజల కష్టాలు తెలిసిన ప్రభుత్వం తమదని చెప్పారు. కార్మికులు, కర్షకులు, చేనేతలు ఇలా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలను అందిస్తోందని వివరించారు. పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందేలా తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెచ్చిందని వివరించారు. ఏ కుటుంబమైనా అభివృద్ధి చెందాలంటే ఆ ఇంటిలోని భావి పౌరులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి జగనన్న ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఇంగ్లిషు మీడియం, జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో పథకాలతో పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారని వివరించారు. దీనికి తోడు వైద్య రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు మంత్రి వివరించారు. ఆరోగ్యశ్రీని దాదాపు అన్ని వ్యాధులకు వర్తింపజేస్తున్నామన్నారు. రూ.16వేల కోట్లతో గ్రామ స్థాయిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం నుంచి మెడికల్ కళాశాలల నిర్మాణం వరకు ఎంతో పకడ్బందీగా చేపడుతున్నామని వివరించారు. ఒక్క పట్టణ పరిధిలోనే మూడు అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం చేసినట్టు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అందరికీ ఇళ్లు, జగనన్న కాలనీలు నిర్మిస్తోందని పేర్కొన్నారు. జగనన్న కాలనీలలో పేదవారి సొంతింటి కలలు సాకారమవుతాయని వివరించారు. ప్రజా సంక్షేమం కోసం ఎంతో చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని, మళ్లీ సంక్షేమ సర్కారును ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తోట నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు తోట సురేష్, షేక్ ఖాదర్ జిలాని, ఇర్రి రాఘవ, ఎ.అమర్, ఇర్రి చిన్న, శానం మల్లి, పమిడి శైలజ, కె.శ్రీనివాసరావు, జి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల ప్రారంభం

శావల్యాపురం: శావల్యాపురంలో కొత్తగా రూ.8 లక్షలతో నిర్మించిన ఉర్దూ పాఠశాలను (మదర్సా) ఆదివారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముస్లిం మత బోధకుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచి చిన్నారులు దైవభక్తి, సేవాభావం అలవర్చుకోవాలన్నారు. అనంతరం దువా కార్యక్రమంలో పాల్గొన్నారు. ముస్లిం మతపెద్దలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు మక్కెన మల్లికార్జునరావు, సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు పోతురాజు, మండల కో–ఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకులు జవంగుల బాబు, చిట్టేటి రవి, కొండారెడ్డి, మదార్, వీరనారాయణ, ముట్లూరి సత్యం, పోట్టిపాటి శ్రీను, శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును సత్కరిస్తున్న ముస్లింలు

నేడు ఈపూరు ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

ఈపూరు : ఈపూరు మార్కెట్ యార్డు కొత్త పాలకవర్గ సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు యార్డు కార్యదర్శి మురళి ఆదివారం తెలిపారు. పాలకవర్గ గౌరవాధ్యక్షునిగా వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, చైర్మన్‌గా చుండూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ బెలూం శ్రీరామ్‌రెడ్డిలతో పాటు మరో 17 మంది కమిటీ మెంబర్లుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.



చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు



వైస్ చైర్మన్ బెలూం శ్రీరామ్‌రెడ్డి

వైభవంగా ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో శ్రీభీమేశ్వర వీరభద్రేశ్వర స్వామివార్ల బింబియంత్ర శిఖర ధ్వజ పునఃప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య నూతనంగా నిర్మించిన ఆలయంలో అద్దంకమ్మతల్లి (పోతురాజుసమేత), గంగాపార్వతిసమేత భీమేశ్వర స్వామి, బొడ్రాయి, గ్రామదేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సం నిర్వహించారు. స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి స్వామి వార్ల తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 25 వేల మందికి భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సత్తెనపల్లికి చెందిన పూర్ణనేత్ర, దంత వైద్యశాల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నూతన ఆలయ, జీవధ్వజ ప్రతిష్ఠ మహోత్సవంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటిరాంబాబు పాల్గొని స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): ద్విచక్రవాహనం ఆటోను ఢీకొన్న ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన మండలంలోని గోళ్లపాడు గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. మండలంలోని తురకపాలెం గ్రామానికి చెందిన గుంటూరు హరీష్‌బాబు ద్విచక్రవాహనంపై తురకపాలెం నుంచి నరసరావుపేట బయలుదేరాడు. మార్గమధ్యలో గోళ్ళపాడు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హరీష్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఆర్బీకేల పరిధిలో భూసార పరీక్షలు

- సత్తెనపల్లి డివిజన్‌లో 133 రైతు భరోసా కేంద్రాలు
- ఆరు మండలాల్లో 211 మట్టి నమూనాలు

సత్తెనపల్లి: భూమి సారవంతంగా ఉంటేనే దిగుబడులు మెరుగవుతాయి. గత కొన్నేళ్లుగా రైతులు రసాయనాలు అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో భూసారం క్రమంగా తగ్గుతోంది. ఫలితంగా సాగులో ఎరువుల వినియోగానికి అత్యధిక ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల పరిధిలో మట్టి నమూనాలు సేకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రతి రైతుభరోసా కేంద్రం పరిధిలో మట్టి నమూనాలు సేకరించాలని సిబ్బందికి సూచనలు చేసింది. ఇప్పటికే మండలాల వారీగా వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు మండల స్థాయిలో ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించి మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలతో అనేక ప్రయోజనాలు చేకూరుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నేలలో ఉదజని సూచిక, ఆమ్ల, క్షార లవణాల స్థాయి, సేంద్రియ కర్బనం, భాస్వరం, పొటాషియం నిష్పత్తులు వెల్లడవుతాయని చెబుతున్నారు. తద్వారా పొలానికి ఏయే ఎరువులు ఎంత మోతాదులో వినియోగించాలో తెలుసుకోవచ్చు. తద్వారా ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చు. సూక్ష్మ ధాతుల లోపాలను సవరించుకుని సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చు. నమూనాలకు సేకరించే మట్టిలో రాళ్లు, ఇతర వ్యర్థాలు లేకుండా చేసుకోవాలి. రైతు వివరాలు, పంట తదితర వివరాలను పొందుపరచాలి. అప్పుడే ఆ మట్టిని ల్యాబ్‌కు పరీక్ష నిమిత్తం పంపిస్తారు.



కందులవారిపాలెంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సత్తెనపల్లి డివిజన్‌లో ఆర్బీకేలు, మట్టి నమూనాలు ఇలా...

మండలం	ఆర్బీకేల సంఖ్య	మట్టి నమూనాలు
సత్తెనపల్లి	20	60
ముప్పాళ్ళ	13	26
రాజుపాలెం	14	29
నకరికల్లు	14	–
పెదకూరపాడు	14	–
అచ్చంపేట	17	50
అమరావతి	16	–
క్రోసూరు	15	26
బెల్లంకొండ	10	20
మొత్తం	133	211

ఫలితాలతో సాగు ఖర్చు తగ్గించుకోవచ్చు



రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించడం ద్వారా సాగు ఖర్చును తగ్గించుకోవచ్చు. వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏకు ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించాం. ఆర్‌బీకే సిబ్బంది ఇప్పటికే వారికి కేటాయించిన నమూనాలు సేకరించారు.

–ఎస్.శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకుడు, సత్తెనపల్లి

కౌలు రైతు బలవన్మరణం

సత్తెనపల్లి: కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గోరంట్ల గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన గురజాల ప్రసాద్ (42) పొలంలోని తిరుపతమ్మ తల్లి గుడి వద్ద గల నేల బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఏటా 4-5 ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి పంటలను సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో కొంత అప్పులయ్యాయి. అప్పులు తీరే మార్గం కనిపించక నిత్యం బాధపడుతున్నాడు. ఈ క్రమంలో పురుగు మందు సేవించి బలవన్మరణానికి పాల్పడేందుకు శనివారం యత్నించగా కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో ఆగిపోయాడు. ఆదివారం నేల బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడినట్లు మృతుని తండ్రి నరసింహరావు చెప్పాడు. సుమారు రూ. 7 నుంచి 10 లక్షల వరకు అప్పులు ఉన్నాయని వివరించాడు.